# రాధ

శ్రీ పోలిశెట్టి వేంకట నాగేశ్వరరావు

కృష్ణుడు భావప్రపంచంలో విహరిస్తూ ప్రేమగీతాలు అల్లుకుంటున్నాడు. చక్కగా సింగారించుకుని రాధ వెనకాల వచ్చి నిల్చుంది. కృష్ణుడు రాధను చూడలేదు. నవ్వుకుంటూ నోటిలో మాట్లాడుకుంటూ వ్రాసుకుంటున్నాడు. రాధ కొంతసేపు చూచి కళ్లు మూసింది. చేతులు వదలించుకొని ప్రక్కకు చూచాడు. రాధ పకపక నవ్వుతూ నిలబడింది.

'ఓహో...తమరా...ఎవరో అనుకున్నాను.'

'ఆ...నేనే. ఇప్పటికైనా యీ లోకంలోకి వచ్చారా? ఎవరితో ఆ మాటలు?'

'ఇంకెవరుంటారు? రాధతోనే.'

'రాధతోనా...ఏ రాధ?' అని అసూయతో ముఖం చిట్లించుకొని అడిగింది.

'ఎరుగవూ? నేను ప్రేమించిన రాధ.'

'ప్రేమించిన రాధా. ఎవరబ్బా ఆ రాధ?'

'ప్రేమించడమే కాదు. పెళ్లికూడా చేసుకోబోతున్నాను.'

'అయితే ఎక్కడ వుంటుందేమిటి ఆ రాధ?'

'ఉండేచోటే వుంటుంది. తమకెందుకులెండి ఆ వివరాలన్నీ!'

'అబ్బా! చెప్పు బావా! చెప్పవూ?' అని దీనంగా అడిగింది.

'చెప్పనా? ఆ రాధ భావప్రపంచంలో వుంటుంది.'

'భావప్రపంచం అంటే ఎలావుంటుంది?'

'చక్కగా, నీలాగే వుంటుంది.'

'చక్కగా అంటే అక్కడేమి వుంటాయేమిటి?'

'అన్నీ వుంటాయి. వెన్నెల రాత్రులు, తళతళ మెరిసే పర్వతాలు, వాటిపైనుండి జలజల రాలే జలపాతాలు వుంటాయి. వాటిని ఆనుకొని, అల్లిబిల్లిగా అల్లుకొనే లతలతో, పచ్చని ఆకులమధ్యనుండి అందంగా తొంగిచూసే పుష్పాలతో నిండివుండే వనాలుంటాయి. అక్కడే వుంటుంది నీలాంటి రాధ.'

'కృష్ణుడో మరి.'

'రాధ అక్కడవుంటే కృష్ణుడు ఎక్కడికిపోతాడు?'

రాధ రెప్పవాల్చకుండా చూస్తూ ఆలోచిస్తోంది.

'వెఱ్ఱి అమ్మాయీ! ఆ రాధ ఎవరనుకున్నావ్? నువ్వే.' అని బుగ్గమీద వ్రేళ్లతో తట్టాడు 'అబ్బా. నేనేనా?' అని నవ్వింది. 'నిల్చున్నావేం? కూర్చో రాధా' అనగానే కూర్చుంది.

'తమరేదో పనిమీద దయచేసినట్టున్నారే?'

'చిత్తం. ఈ జేబురుమాలుమీద బొమ్మ వేసివ్వండి. త్వరగా పోయి కుట్టుకోవాలి.'

'ఏమిటా తొందర. వేసిస్తాను గాని, నేనొకటి అడుగుతా యిస్తావా?'

'తప్పకుండా యిస్తాను.'

'అయితే లేచి నిలబడు.'

'ఊఁ.........'

'ఇలా దగ్గరకు రా.'

'ఊఁ.........'

'ముఖం ప్రక్కకు తిప్పు' ఏమిటీ మిలిటరీ డ్రిల్లు అని మూతి బిడాయించుకొని వెళ్లిపోతూవుంది.

'రాధా...రాధా...యిలారా. మూతికి తాళంవేసుకున్నావేం? నామీద నీకు కోపంవచ్చిందా?' అని పిలచి బొమ్మ వేసిస్తున్నాడు.

'పిచ్చి అమ్మాయీ. అంత కోపంవస్తే ఎలా చెప్పూ? ఇదుగో మకరందంతో గూడిన పుష్పం. ఇదుగో దీనిపైన భ్రమరం. పుష్పంలోని తియ్యదనాన్ని త్రాగి ఎలా ఆనందిస్తోందో చూచావా? అంగము నాకేకదా వుందని నీలాగ వికసించకుండా మూతిముడుచుకొని కూర్చుందా?'

'అవును. నిజమే. పాపం భ్రమరము వచ్చిందికదా అని ఎంతో సంతోషంగా నవ్వుతుంది. నమ్మి సర్వం అర్పించేస్తుంది. కాని త్రాగి ఆనందం అనుభవించేవఱకు వుండి యింకో పుష్పందగ్గరకు పోతుందని దానికేమి తెలుసు? అమాయకురాలు! వికసించి నవ్వదూ?'

'చాలా గొప్పగా మాట్లాడావే? నీకు నేను సమాధానము చెప్పలేను గాని...వుండు యీ సంగతి దానికి చెబుతాను. 'ఓ భ్రమరమా! మా రాధ చెప్పే సలహా విను, బాగుపడతావు. లేకపోతే ఎందుకూ పనికి రాకుండా పోతావ్. నీవు వ్రాలే పుష్పం ఎంత కోపగించుకొన్నా, ఎంత నవ్వమన్నా నవ్వకుండా మూతి బిడాయించుకొన్నా, నీవే యీ ప్రపంచంలో నాకు దిక్కు. ఇంకేపుష్పం నాకు దొరకదు. అని బ్రతిమాలుకో, లేకపోతే మా రాధ నిన్ను అన్ని పువ్వుల్లో దూరేరకం అనేస్తుంది.' చెప్పాను...చాలా.'

'అ...చాలు' అని వచ్చేనవ్వు ఆపుకొంటూ 'మరే.'

'మేమంతా సినిమాకు వెళుతున్నాం. నువ్వుకూడా వస్తావా.'

'అ...సినేమా ఏమిటి చూసేదిగాని, వాళ్లందరిని వెళ్లనియ్, ఏ తలనొప్పో అని నువ్వు ఆగిపో.'

'చిత్తం' అని జేబురుమాలు తీసుకొని మెరుపులాగ మెరసి వెళ్లిపోయింది.

కృష్ణుడు సెలవలు ఆఖరైపోవడంచేత కాకినాడ వెళ్లిపోతూ రాధతో చెప్పడానికి వచ్చాడు. అప్పుడే రాధ 'ఓ గొజ్జెమ్మా...మా బావ యీ ఏడు బి. ఏ. ప్యాసయితే నీకు ఎన్నో కొబ్బరికాయలు కొడ్తాను.' అని దణ్ణం పెడుతూవుంది. 'రాధా వెళ్లివస్తాను.' అని చెప్పి కృష్ణుడు బండి ఎక్కాడు. రాధ గుమ్మానికి జేరబడి కంట నీరు కారుస్తూ అతనివంక చూస్తూవుంది. క్రమముగా ఆ బండి రాధను కృష్ణుడిని దూరం చేసింది.

కృష్ణుని తండ్రి డబ్బుగలవాడు. కాని డబ్బుకి గడ్డితినేమనిషి. కొడుకుని చదివించిన డబ్బంతా కట్నం ద్వారా రాబట్టుకోవాలని ఆశతో కూర్చున్నాడు. రాధ కృష్ణుడి మేనత్త కూతురవడంవల్ల చిన్నప్పటినుంచీ, వారిద్దరికీ పెళ్లిచెయ్యాలని అనుకొనేవారు. ఒకరోజున రాధ తండ్రి అతనిని పెళ్లివిషయమై అడిగాడు. ఆయన రెండువేల రూపాయలు కట్నం అడిగాడు. రాధ తండ్రికి మ్యునిసిపాల్టీలో 40 రూపాయల వుద్యోగమగుటచేత నేనివ్వలేనన్నాడు. రాధ తల్లికూడా వెళ్లి అన్నను బ్రతిమాలింది. లాభంలేక పోయింది. రాధకు యింకొక సంబంధము చూసాడు తండ్రి. రాధ తల్లిదండ్రులను యింకొక సంబంధము చూడవద్దని బ్రతిమాలింది కాని, వారామాటలను లెక్క-చేయలేదు.

రాధకు పెండ్లయి రెండునెలలయ్యింది. అప్పట్నుంచి రాధ అదొకమాదిరిగా మారిపోయింది. కృష్ణుడు పుస్తకాలను పట్టుకొని, పైకి చూస్తూ ఆలోచిస్తూవుండేది. నలుగురిలోకి వచ్చి మాట్లాడడం మానేసింది. క్రమక్రమముగా రాధ మంచంపట్టింది. ఎంతమందో డాక్టర్లు ఎన్నో మందులిచ్చారు. గుండెల్లో మంట తగ్గలేదు. 'కృష్ణా...కృష్ణా' అని రాధ మూల్గుతూవుంది. 'కృష్ణా...కృష్ణా' అనే యింత కొంప ముంచావ్! 'యికనైనా మర్చిపో' అంది రాధ తల్లి.

'అమ్మా బావని కాదే...దేవుడ్ని తలుచుకుంటున్నాను.' అని రాధ సర్దుకొంది. 'వాడి కట్నం తగలబెట్ట! నీవుసురు పోసుకున్నాడమ్మ' అని రాధ తల్లి కంట నీరు పెట్టుకొంది. రాధతండ్రి ప్రక్కన కూర్చున్నాడు విచారిస్తూ.

'నాన్నా బావను పిలిపించు, నీకెంతో పుణ్యం వుంటుంది. నాన్నా నీకు దణ్ణంపెడతాను. బావను చూసి ప్రాణం వదుల్తాను.' అని అడిగింది. 'అమ్మా, యిదుగో టెలిగ్రాం యిస్తున్నాను. పడుకో తల్లి యిప్పుడే వస్తాను.' అని కంటినీరు తుడుచుకుంటూ వెళ్లిపోయాడు.

భయంకర స్వరూపంతో రాత్రి ప్రారంభ మయ్యింది. చెట్లు విచారంగా తలలూపుతున్నాయి. అప్పుడే తీతువ పిట్ట కూసుకుంటూ యింటి మీదుగా వెళ్లిపోయింది. రాధ మూల్గుతూవుంది. కృష్ణుడు యింట్లోకి పరుగెత్తుకొనిపోయి మంచంమీద కూర్చున్నాడు.

'రాధా...రాధా, యిటు చూడు' అని కన్నీళ్లుకారుస్తూ చెయ్యిపట్టుకున్నాడు.

'వచ్చావా...బావా...వచ్చావా' అని కన్నీళ్లు కారుస్తూ ముఖంలోకి తొంగిచూచింది.

'బావా నన్ను క్షమించు...నిన్నుమోసంచేసాను'

'రాధా, నీది తప్పుగాదు. నాతండ్రిది. ధనదాహంతో మనప్రాణాలు తీసుకున్నాడు రాధా'

'బావా! నువ్వు యింకా దగ్గరగా రా. నాగుండెల్లో మంట చల్లబడుతుంది.' అని కృష్ణుడి వడిలో తలపెట్టుకొని చూస్తూవుంది.

'అబ్బా రాధా, నీ అందం మటుమాయ మయ్యిందా? కాదు. రాధా, నిన్ను వివాహంచేసుకొని మన ప్రేమలతతో కైలాసగిరిని అందుకుందా మనుకున్నాను. ఒక ఆదర్శ జీవితాన్ని ఈ పాడుప్రపంచానికి చూపించుదా మనుకున్నాను. మనమిద్దరమూ ప్రేమకుసుమాలతో పూలదండను కట్టుకున్నాము. కాని... రాధా...కాని...నాతండ్రి ధనదాహంతో ఆ దండను తెంపేశాడు. హృదయంలేని సంఘానికి, అర్థంలేని

కట్నపిశాచానికి మనప్రాణాలు బలైపోయినయ్. రాధా... పద వెళ్లిపోదాం. ఈ పాడుసంఘంలో వుండే కంటే... ఆ నరకలోకంలోకే పోదాం పద. అదే బాగుంటుంది, దీనికంటే.'

'బావా! ఈ విశాల ప్రపంచంలో అనేక సుందరమైన నావంటి రాధలు ఎంతమందో వున్నారు. పెళ్లిచేసుకుంటానని నా చేతిలో చెయ్యివెయ్యి. నేను సుఖంగా కళ్లుమూసుకుంటాను. నీవలా దుఃఖమయ జీవతాన్ని గడిపితే నామనస్సుకు శాంతివుండదు.' అని గడ్డం పట్టుకుంది.

'రాధా! యిసుకలాగవున్న నాహృదయంలో నిప్పులు జల్లుతావా? రాధా... నీవులేని ఈ పాడు ప్రపంచంలో నన్నింకా బ్రతుకమంటావా? రాధా... నీసౌందర్యాన్ని కాదే ప్రేమిస్త. రాధా, నీ శీలాన్ని ప్రేమించాను. నాహృదయం కృత్రిమ ప్రేమకు స్థానం కాదు. కళంకరహితమైన ప్రేమకు స్థానం. ఆ వెన్నెల రాత్రిలో నిన్నుతప్ప ఎవరినీ వివాహంచేసుకోనన్నాను. జ్ఞాపకం వుందా?'

'బావా... నేను పెళ్లిచేసుకొని నిన్ను మోసంచేసాను. నీకు జీవితాంతము దుఃఖం కలిగించాను. నిన్ను పెళ్లిచేసుకోడానికి ఎన్నోప్రయత్నాలు చేసాను. కాని నా విధినిర్ణయం యిలావుంది. నీ రాధను కాలేకపోయాను. నేనింక మాట్లాడలే' నని కృష్ణుడి తలను హృదయానికి జేర్చుకొని బావా... బావా... అంటూ నీలాకాశంలో కలిసిపోయింది.

ఏడ్పులు విని కృష్ణుడి తండ్రి వచ్చి నిల్చున్నాడు. 'వచ్చావా నాన్నా... నా రాధను నీ కట్న పిశాచానికి ఆహుతిచేశావా నాన్నా? నన్ను అమ్ముకొని జీవిద్దామనుకొన్నావా? వెఱ్ఱినాన్నా! అన్యాయంగా నా రాధ వుసురు పోసుకున్నావు!' అని పాపం కృష్ణుడు మంచం ఎక్కాడు.

## పోలిక

గీ. పలుకుచుండును వీనులు కులుకురీతి,
వినిన ముదమును పుట్టించు వింతకూత;
పోల్చిజూడఁగ కాకిని పోలియుండుఁ
గోరిచూడఁగ నాపక్షి కోకిలంబ్రదు॥

గీ. అట్లె జ్ఞానినిఁజూడఁగ నవనియందు,
మంచిమార్గమునందున మసలుచుండు;
పోల్చ రూపమున్ మూర్ఖునిపోలియుండు,
వారి నడతలు వారలన్వేరుచేయు.

గీ. దాత లుబ్ధుల పోలిక ధరణియందు
యించుకైనను భేదము గాంచలేము;
కాని వారలుఁ జేసెడి కార్యములను
పోల్చ వేర్వేరుబిరుదులు పొందుచుంద్రు.

గీ. అట్లె మూర్ఖుని పండితున్ అరసిచూడ,
పోల్కెయందును మూర్ఖునిపోలియుండు;
కాని పాండిత్యమందును గాంచగాను
బడయు పండితుఁడను పేరుపుడమియందు.

గీ. ఎంచ భూతలమందున నెల్లజనులఁ
బోల్కెమాత్రాన ఘనుఁడని పోల్చదగదు
జ్ఞాన యజ్ఞానములు రెండుఁ గానవలయు
దీనిసూత్రము డెందమా తెలుసుకొనుమ.

—డి. శకుంతలాదేవి.